చంచల్‌గూడ పిల్లిగుడిసెల పునరావాస కేంద్రాన్ని సందర్శించిన సెర్ఫ్ సీఈఓ, ప్రజా భవన్ రాష్ట్ర నోడల్ కమిషనర్ స్వయం సహాయక సంఘాల చైర్మన్ దివ్య దేవరాజన్, ఎమ్మెల్యే బలాలకు సమస్యలు వివరిస్తున్న బాధితులు

మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న సెర్ఫ్ సీఈఓ, ప్రజా భవన్ రాష్ట్ర నోడల్ కమిషనర్ దివ్య దేవరాజన్

డబుల్ ఇండ్లు..సమస్యల నెలవు

- కరెంటు లేదు.. పనిచేయని లిఫ్ట్
- 'పిల్లి గుడిసెల' పునరావాస కేంద్రాన్ని సందర్శించిన సెర్ఫ్ సీఈఓ, ప్రజా భవన్ రాష్ట్ర నోడల్ కమిషనర్ దివ్య దేవరాజన్
- ఇండ్లలో సరైన వసతులు లేవంటూ.. గోడు వెల్లబోసుకున్న మూసీ నిర్వాసితులు

మలక్‌పేట/సైదాబాద్, అక్టోబర్ 23: మలక్‌పేట మూసీ నిర్వాసితుల పునరావాస కేంద్రం చంచల్‌గూడలోని పిల్లి గుడిసెలను బుధవారం సెర్ఫ్ సీఈఓ, ప్రజా భవన్ రాష్ట్ర నోడల్ కమిషనర్ స్వయం సహాయక సంఘాల చైర్మన్ దివ్య దేవరాజన్ ప్రజా భవన్ రాష్ట్ర నోడల్ కమిషనర్ స్వయం సహాయక సంఘాల చైర్మన్ దివ్య దేవరాజన్ సందర్శించారు. ఆర్డీఓ మహిపాల్, మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, సైదాబాద్ తాసీల్దార్ జయశ్రీ, సౌత్‌జోన్ జోనల్ కమిషనర్ వెంకన్న, జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ యూసీడీ చంద్రకాంత్‌రెడ్డి, హౌజింగ్ సీఈ అనిల్‌రాజ్, డీసీ జయంత్, జీహెచ్ఎంసీ, హౌజింగ్ ఈఈ, విద్యుత్‌శాఖ, యూసీడీ, వివిధ శాఖల అధికారులతో కలిసి సందర్శించిన ఆమె పలువురు లబ్ధిదారులతో మాట్లాడి పునరావాస కేంద్రంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పనిచేయని లిఫ్ట్..

పిల్లి గుడిసెల పునరావాస కేంద్రం సందర్శనకు వచ్చిన కమిషనర్ దివ్య దేవరాజన్ లిఫ్ట్‌లో పైకి వెళ్లేందుకు ఎక్కగా లిఫ్ట్ పనిచేయలేదు. కొన్ని ఇళ్లలోకి విద్యుత్ సరఫరా కూడా కావటం లేదని, కరెంట్ సరిగ్గా ఉండటం లేదని, మెట్లద్వారా పది అంతస్తుల పైకి వెళ్లాలన్నా, కిందకి రావాలన్నా చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని బాధితులు తెలిపారు.

దుకాణాలు లేక ఇబ్బందులు..

పిల్లిగుడిసెల్లోని షాపులను తీసుకున్న వ్యక్తులు రెంట్లు సరిగా చెల్లించకపోవటంతో షాపులు మూసివేశారని, దాంతో తమకు దగ్గరగా దుకాణాలు లేక చాలా ఇబ్బందులు పడాల్సివస్తుందని బాధితులు తెలిపారు.

వెయ్యి నిర్మాణాలు గుర్తించాం..

మూసీ బాధితుల్లో హైదరాబాద్ జిల్లాలో గూగుల్ మ్యాప్ ఆధారంగా 1598 నిర్మాణాలను గుర్తించగా, సర్వే పరంగా మొత్తం 1000 నిర్మాణాలు గుర్తించటం జరిగిందని, వాటిలో 707 మాత్రమే రెసిడెన్షియల్‌గా గుర్తించటం జరిగిందని, మిగతా 300 సర్వే కాలేదని హైదరాబాద్ జిల్లా ఆర్డీఓ మహిపాల్ తెలిపారు. కేవలం నివాస గృహాలు కోల్పోయిన బాధితులకు మాత్రమే పునరావాసం కల్పించటం జరుగుతుందని, కమర్షియల్, రెంటల్స్‌కు ఏమి ఇవ్వటం లేదని తెలిపారు. హైదరాబాద్ జిల్లా పరిధిలోని సైదాబాద్ మండల రెవెన్యూ పరిధిలో మొత్తం 109 నిర్మాణాలను గుర్తించగా, 76 మందికి పునరావాసం(డబుల్ బెడ్‌రూం ఇండ్లు) కల్పించటం జరిగిందని, అదేవిధంగా హిమాయత్‌నగర్ రెవెన్యూ పరిధిలో 156 మందికి, నాంపల్లి పరిధిలో 30 మందికి పునరావాసం కల్పించటం జరిగిందని తెలిపారు.

అందని ఆర్థిక సాయం..

స్వయం సహాయక గ్రూపుల్లో మొత్తం130 మంది ఉండగా, 120 మందికే ఆర్థిక సహాయాన్ని అందించారని, మిగతావారిని ఎందుకు గుర్తించలేదని, ఆర్థిక సహాయాన్ని తీసుకోవడానికి మిగతావారు ఎందుకు ముందుకు రావటంలేదని అధికారులను ఆరా తీశారు. కారణాలు తెలుసుకొని అందరికీ రుణాలు అందేలా చూడాలని యూసీడీ అధికారులకు సూచించారు. మెయిన్ రోడ్డును ఆనుకునే డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయం ఉండటంతో తమ పిల్లలు దగ్గర్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లేందుకు రోడ్డు దాటేందుకు ట్రాఫిక్ సమస్యతో భయమేస్తుందని బాధితులు తెలుపటంతో, ఎమ్మెల్యే బలాల జోక్యం చేసుకొని పిల్లలకోసం రెండు వ్యాన్లను అందుబాటులో ఉంచుతానని తెలిపారు. ఈ సందర్భంగా గతంలో అక్కడున్న పరిస్థితులను, ప్రస్తుతం కల్పించిన వసతులను ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల కమిషనర్ దివ్య దేవరాజన్‌కు వివరించారు. విద్యుత్ సరిగా ఉండటం లేదని, లిఫ్ట్ పనిచేయటం లేదని, పలు సమస్యలు ఉన్నాయని బాధితుల నుంచి తమకు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో వాటిని తెలుసుకొని పరిష్కరించేందుకు తాను వచ్చినట్లు తెలిపారు. బాధితుల పిల్లల చదువులకు సంబంధించి పిల్లి గుడిసెల్లో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయటం జరిగిందని, మిగతావారి పిల్లల చదువులకు సంబంధించి పునరావాస కేంద్రాల సమీపంలో ఉన్న విద్యాసంస్థల్లో వారికి ప్రవేశాలు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బాధిత కుటుంబాల మహిళలకు స్వయం సహాయక గ్రూపులద్వారా ఒక్కొక్కరికి రూ.2లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రజాప్రభన్‌లో మంత్రి సీతక్క అందజేయటం జరిగిందని, అందులో రూ.లక్షా నలభై వేలు సబ్సిడీ పోను రూ.60వేలు మాత్రమే లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. బాధిత మహిళలకు ఆర్థిక స్వావలంభన చేకూర్చేందుకు వారికి ప్రభుత్వపరంగా రూ.2లక్షల ఆర్థిక సహాయాన్ని అందించటం జరిగిందని తెలిపారు. పిల్లి గుడిసెల్లో నీటి ఎద్దడి ఉందని తన దృష్టికి వచ్చిందని, కాని హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అక్కడికి ప్రత్యేకంగా పైపులైన్‌వేసి తాగునీటి వసతి కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చావునీ కార్పొరేటర్ ఎంఏ సాలం షాహిద్, వివిధ శాఖల అధికారులు, పిల్లి గుడిసెల నిర్వాసితులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో నిరుపేదలకు లబ్ధి

బాధిత కుటుంబ సభ్యులకు ఎల్ఓసీ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్, అక్టోబర్ 23: ముఖ్యమంత్రి సహాయ నిధితో నిరుపేదలకు లబ్ధి చేకూరుతుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్‌లోని హైకోర్టు కాలనీకి చెందిన బాధిత కుటుంబ సభ్యులకు మంజూరైన రూ.4.50 లక్షల ఎల్ఓసీని ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైకోర్టు కాలనీకి చెందిన వెంకటేశ్వర్లు, రేణుక దంపతుల కుమారుడు దీక్షిత్(8) పుట్టుకతో చెవులు వినిపించక మాటలు రావడం లేదన్నారు. దీక్షిత్ ఆపరేషన్‌కు ఆర్థిక సహాయం కోసం తన వద్దకు వస్తే సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.4.5 లక్షల చెక్కును అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం మాజీ కార్పొరేటర్ భవానీప్రవీణ్‌కుమార్, సీనియర్ నాయకులు సదానంద్‌రెడ్డి, బైర శంకర్, సత్తిరెడ్డి, కిట్టు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన మేయర్

బడంగ్‌పేట, అక్టోబర్ 23: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ పరిధిలోని సీపీఎన్ఆర్ టౌన్‌షిప్ ఫేజ్-2 కాలనీలో సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ బండారి మనోహర్‌తో కలిసి మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు. అనంతరం మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని ఆర్ఏసీఐ ఎక్స్ రోడ్డు నుంచి ఎయిర్ పోర్టు వరకు ఆరు లైన్ల రోడ్డు పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ డీసీఎల్ ఈఈ విజయ్ కుమార్, ఏఈఈ వినీల్ గౌడ్, కార్పొరేటర్ సుదర్శన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎంబీఏ పరీక్ష జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 23: ఓయూ పరిధిలోని ఎంబీఏ పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 4వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 23: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ లాంగ్వేజెస్, మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ తదితర కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు.

వివిధ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 23: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్/సీనియర్ డిప్లొమా ఇన్ ఫ్రెంచ్/జర్మన్ పరీక్షలను వచ్చే నెల 5వ తేదీ నుంచి, బీఫార్మసీ (పీసీఐ) ఎనిమిదో సెమిస్టర్ మేకప్ పరీక్షలను 6వ తేదీ నుంచి, బీసీఏ ఆరో సెమిస్టర్ మేకప్ పరీక్షలను 8వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 23: ఓయూ పరిధిలోని బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. మెమోలను మూడువారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి ఈనెల 28వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈనెల 30వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

డిసెంబర్ నుంచి స్పోర్ట్స్ లీగ్ సీజన్-4 క్రికెట్ పోటీలు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

మలక్‌పేట, అక్టోబర్ 23: శ్రీకృపా మార్కెట్ హోల్‌సేల్ అండ్ రిటైల్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 1,8,15,22 తేదీల్లో ఎస్‌కేఎం హైదరాబాద్ గ్లోబల్ మర్చంట్ స్పోర్ట్స్ లీగ్ సీజన్-4 క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు శ్రీకృపా మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడు చిక్కా చంద్రమోహన్ తెలిపారు. బుధవారం మలక్‌పేటలోని శ్రీకృపా మార్కెట్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన స్పోర్ట్స్ లీగ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని బేగం బజార్, మహరాజ్ గంజ్, సికింద్రాబాద్ వ్యాపారులందరు కలిసి ప్రతియేట స్పోర్ట్స్ లీగ్ క్రికెట్ పోటీలను నిర్వహించటం జరుగుతుందని, డిసెంబర్‌లో నిర్వహించనున్న స్పోర్ట్స్ లీగ్ సీజన్-4 పోటీలను నాగోల్‌లోని సీఎన్ఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నామని తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు ట్రోఫీలు అందజేయటం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో హైదరాబాద్ కిరాణా అసోసియేషన్ కార్యదర్శి మనీష్ బాటి, హైదరాబాద్ దాల్ మర్చంట్ అసోసియేషన్ కార్యదర్శి అనిల్ కాబ్రా, శ్రీకృపా మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడు చిక్కా చంద్రమోహన్, కార్యదర్శి దీపక్ మోడీ, అడ్వయిజర్లు మహేందర్ జైన్, అశోక్ గుప్తా, సభ్యులు సురేశ్, పవన్, మహేశ్, వికాస్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిత్తడి చిత్తడి

- సింగరేణిలో అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- పొంగిపొర్లుతున్న మురుగునీరు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవాలని వేడుకోలు

సింగరేణికాలనీ వాంబే క్వార్టర్స్ ముందు ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు

సైదాబాద్, అక్టోబర్ 23: ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణికాలనీ ప్రధాన రహదారిపై వారం రోజులుగా డ్రైనేజీ మురుగునీరు పొంగిపొర్లుతూ ఏరులై పారుతుంది. కాలనీ ప్రధాన రోడ్లపై వాహనాలు ప్రయాణించాలంటే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు పొంగిపొర్లుతున్న డ్రైనేజీ దుర్వాసనకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోతున్నారు. మురుగునీరు పొంగి పొర్లుతున్న విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులకు, జలమండలి అధికారులకు విన్నవించినా పట్టించుకోవటంలేదని ఆరోపిస్తున్నారు. తరచూ రోడ్లపై మురుగు పొంగిపొర్లుతుండటంతో తాము అనేక ఇబ్బందులు పడుతున్నామని, అదే విధంగా డ్రైనేజీ వ్యవస్థలను శుభ్రం చేసిన వ్యర్థాలను అలాగే వదలి పెట్టి వెళ్లటంతో దుర్గంధం వెదజల్లుతుందన్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజా ప్రతినిధులు, జలమండలి అధికారులు స్పందించి పొంగిపొర్లుతున్న డ్రైనేజీ మురుగు నీటి ప్రవాహాన్ని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

శివారు కాలనీల అభివృద్ధే లక్ష్యం

మన్సూరాబాద్, అక్టోబర్ 23: శివారు ప్రాంత కాలనీల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి పవనగిరికాలనీ ఫేజ్-2, ఎల్లారెడ్డి కాలనీ, లక్ష్మీనగర్‌కాలనీ, కొలను శివారెడ్డికాలనీ, ఆగమయ్యనగర్‌లో పర్యటించిన ఆయన సదరు కాలనీల్లో రూ.93.50లక్షల నిధులతో త్వరలో చేపట్టనున్న సీసీరోడ్డు, యూజీడీ పనుల విషయాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరింపజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, కడారి యాదగిరియాదవ్, పారంద సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధానం

వనస్థలిపురం, అక్టోబర్ 23: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రాధాన్యతగా పనిచేస్తున్నామని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. జెడ్పీరోడ్ నాయార బంక్ వద్ద నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేయడంతో బుధవారం అక్కడికి చేరుకున్న కార్పొరేటర్ పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన నిధులు విడుదల చేయించి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీల్లో ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సాయిరెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీరోడ్‌లో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాత నాయక్

వ్యక్తి అదృశ్యం

సంతోష్ (ఫైల్)

హయత్‌నగర్, అక్టోబర్ 23: ఇంటి నుంచి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తొర్రూర్ గ్రామానికి చెందిన దుంగ్రావత్ సంతోష్(32), ప్రియాంక దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. సంతోష్ వృత్తిరీత్యా ఇసుక లారీలు ఖాళీ చేసేందుకు వెళ్తుంటాడు. 3, 4 రోజులు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుంటాడు. నెల క్రితం పనికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన సంతోష్ ఈనెల 7న భార్యకు ఫోన్ చేసి పనిమీద వెళ్తున్నానని చెప్పి ఇప్పటికీ తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు సంతోష్ ఆచూకీ కోసం చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మూసీ పరీవాహక ప్రాంతంలో ఎంపీ పర్యటన

ఎల్బీనగర్, అక్టోబర్ 23: మూసీ పరీవాహక ప్రాంతంలో ఎంపీ ఈటల రాజేందర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం అనాలోచిత నిర్ణయాలు, దుందుడుకు చర్యల మూలంగా మూసీ పరీవాహక ప్రాంత ప్రజలు భయాందోళనతో బతుకుతున్నారని తెలిపారు. ఈనెల 25న ఇందిరా పార్కు వద్ద మూసీ బాధితులతో ర్యాలీ నిర్వహించి నిరసన చేస్తామని తెలిపారు.

ప్రత్యేక పూజలు

ఆర్కేపురం, అక్టోబర్ 23: కొత్తపేటలోని అష్టలక్ష్మి ఆలయంలో బుధవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌రావుతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అంబేద్కర్ భవన స్థలాన్ని కాపాడాలి

కందుకూరు, అక్టోబర్ 23: బాచుపల్లి గ్రామంలోని అంబేద్కర్ యువజన సంఘం భవన స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని సంఘం నాయకులు కోరారు. తమ గ్రామంలోని సర్వే నంబర్ 287లో 460గజాల స్థలంలో అంబేద్కర్ యువజన సంఘం భవన నిర్మాణానికి మంజూరు చేశారని, ఆ భవన నిర్మాణానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి రూ.4లక్షలు మంజూరు చేశారని గుర్తు చేశారు. నిర్మాణం కాస్త ఆలస్యం జరగడంతో ఎర్ర శ్రీనివాస్ అనే వ్యక్తి కబ్జా చేసి జేసీబీలతో స్థలాన్ని చదును చేస్తున్నాడని తెలిపారు. ఈ విషయాన్ని ఎంపీఓ గీత, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సంఘం సభ్యులు తెలిపారు. దీంతో కబ్జా చేస్తున్న వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో యూత్ నాయకులు ధనవంత్రి, శ్రీశైలం, వెంకటేశ్, కృష్ణ, యాదయ్య, మల్లేశ్, రాఘవేందర్, రాజశేఖర్, గోపాల్, మహిపాల్, మహేందర్, సుభాష్, సుధాకర్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకాలు

కరాటే రంగారెడ్డి జిల్లా స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులతో అకాడమీ మాస్టర్ గణేశ్

వనస్థలిపురం, అక్టోబర్ 23: రంగారెడ్డి జిల్లా స్థాయి కరాటే పోటీల్లో అయ్యన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. కర్మన్‌ఘాట్‌లో జరిగిన ఈ పోటీల్లో గణేశ్ మాస్టర్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు బంగారు పతకాలు సాధించారు. హయత్‌నగర్ హైస్కూల్‌లో చదివే బి.సాయి నమిత మొదటి స్థానంలో నిలిచింది. ఎ.మహాలక్ష్మి, జె.సుష్మిత రెండో స్థానంలో నిలిచారు. ఎస్.దివ్య, బి.సిందు, జె.యశ్వంత్ 3వ స్థానంలో నిలిచారు. జిల్లా స్థాయిలో బంగారు పతకాలు సాధించిన వీరు రాష్ట్ర స్థాయిలో ఆడనున్నట్లు గణేశ్ మాస్టర్ తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలని ఆయన సూచించారు. విజయం సాధించిన చిన్నారులను అభినందించారు.

ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా నియమితులైన ప్రొఫెసర్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఉస్మానియా యూనివర్సిటీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ మెంబర్స్ వేదిరే సుదర్శన్‌రెడ్డి, ఎన్.సీతారాంరెడ్డి, పి.రామ్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి. - ఆర్కేపురం



చైతన్యపురి పోలీస్ స్టేషన్ నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వరరావును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఆర్కేపురం డివిజన్ అధ్యక్షుడు పున్న గణేశ్‌నేత, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్‌రావు, గట్ల రవీంద్ర, శివ, పగిళ్ల భూపాల్‌రెడ్డి, దుర్గా ప్రసాద్, జెల్లా జగన్నాథం, బొడ్డుపల్లి మహేందర్, ఎల్లన్న తదితరులు - ఆర్కేపురం, అక్టోబర్ 23

ప్రభుత్వం జలమండలిశాఖ ద్వారా నిర్వహిస్తున్న భూగర్భ డ్రైనేజీ పైపులైన్ వ్యర్థాల తొలగింపు, ఇంటింటికీ ఇంకుడు గుంత నిర్మాణ కార్యక్రమంలో భాగంగా హయత్‌నగర్ డివిజన్‌లోని సుభద్రనగర్‌లో చేపడుతున్న పనులను స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి పరిశీలించారు. - హయత్‌నగర్, అక్టోబర్ 23